

చెట్టుమీద చాకలోళ్ళు బట్ట లుతుకుతున్నారు.

అహోస్... అహోస్.

అష్షా... అహ్హా.

ధోవతుల్ని, చీరల్ని, దుప్పట్లని, జంబుఖానాల్ని తిరగేసి తిరగేసి బండలకేసి బాదుతున్నారు.

ఓ పక్క ముసలి వెంకాయి పెద్ద బానలో నీలిమందు కలుపుతూ "ఓర్నీయమ్మ! పోరగాళ్ళెవరో దీనికి బొక్క కొట్టారేవ్" అన్నాడు పెళ్ళాం పోలేరమ్మతో.

"ఇంకెవరు? ఆ పూజారీది పోరగాళ్ళే రాళ్ళు కొట్టుంటారు. అయినా జన్మంతా ఆ చిల్లి బానేనా? కుమ్మరాయనకి చెప్పి కొత్తది చేయించరాదూ?" అంది పోలేరమ్మ గుడ్డలు పిడుస్తూ.

"ఓసి పోరీ! జన్మంతా నీతోనే కాపరం చేశాను గదా! నువ్వూ ఓటి బానవయిపోయావు. ఇంకోత్తిని కట్టుకోనేంటి?" అన్నాడు బోసినోటి వెంకాయి.

"ఓలబ్బ సంబడం..." అని మూతి విరిచింది పోలేరమ్మ.

## శ్రీ అమరావతి కథలు
### సత్యం శంకరమంచి

"ఏటే! ఈ బాన మా అయ్య కాలం నాటిదే. వొట్టినే పోనిస్తానేటి?" అంటూ వెంకాయి చిల్లికి గుడ్డ పేలికలు పెడుతున్నాడు.

చాకళ్ళు ఎవరి బండల గగ్గరకి వాళ్ళ మూటల్తో చేరుతున్నారు. అవతల పక్క కొత్తగా పెళ్ళయిన లచ్చి, సాంబడు మూటల్తో దిగారు. వాళ్ళిద్దరికీ క్షణం పడదు. ఎప్పుడూ కీచులాటే.

"తిరిగి తిరిగి ఇంతేళ కొచ్చావ్! పొద్దు కనిపిస్తందా!" అన్నాడు సాంబడు.

"నువ్వూ ఇప్పుడే వచ్చి నన్ను దెప్పుతావే? వాళ్ళ బట్టలెయ్యాలా?" తిప్పికొట్టింది లచ్చి.

"సికార్లే గాదు. మాటలు కూడా నేర్చావు గదే!" పళ్ళు కొరికాడు సాంబడు.

"నా కెందుకు సికార్లు? మీసవున్న సోగ్గాడివి నీగ్గావాలి సికార్లు."

"ఏటి! నన్నే ఎక్కిరిస్తన్నావ్! దర్పిన్ మొకం దానా?"

"ఓలబ్బ పెనంమీద అట్లుకాడల్లే ఏం ఎగిరిపడ్తున్నాడు!"

"మక్కెలిరగదంతా భాంఫోత్!" లచ్చి జుట్టు పట్టుకున్నాడు సాంబడు.

"ఓలమ్మో...!" గొల్లుమంది లచ్చి.

వెంకాయి, పోలేరమ్మ పరుగెత్తుకొచ్చి "ఓరి మీరు పడిసావ! బట్ట లుతకకుండానే దెబ్బలాట లేంట్రా?" అని ఇద్దర్నీ విడదీసి పనికి పురమాయించారు.

లచ్చి, సాంబడు మాట్లాడకుండా బట్ట లుతుకుతున్నారు. మనస్సుల్లో ఒకళ్ళ మీద ఒకళ్ళకి ఎందుకో కసి. ఈ పెళ్ళి ఇద్దరికీ ఇష్టం లేదు. పెద్దలు పట్టుబట్టి ఇద్దరికీ ముడేశారు. లచ్చి సన్నగా వుంటుంది. సాంబడికి బొద్దుగా వున్న ఆడపిల్లలంటే ఇష్టం. లచ్చి జడ చిన్నది. సాంబడికి పొడుగాటి జడలున్న పిల్లంటే మనసు. ఆడపిల్ల గజ్జెల పట్టీలు బెట్టుకు నడుస్తుంటే సాంబడి గుండెలో మువ్వలు మోగుతాయి. సాంబడు కొనిచ్చినా లచ్చి గజ్జెల పట్టీలు అవతల పారేసి కడియాలు పెట్టుకు తిరుగుతుంది "టంగు టంగున." లచ్చికున్న ముక్కు బేసరీ, దుద్దులు సాంబడికి బావుండవు. అందుకే లచ్చి అంటే చికాకు... కోపం... అసహ్యం... దాని మాట, పలుకు, నవ్వు, అది చేసిన పచ్చడి ఛీఛీ. సాంబడు కోపంగా చీర ఉతుకుతున్నాడు. ఆ చీర సీతాలు కట్టింది. సీతాలు కళ్ళముందు కదిలింది. అది నెమిలి కంఠం చీర. సీతాలు నెమిలి కంఠం చీర కట్టుకుని ముద్దబంతి పువ్వులా కదుల్తుంటే సాంబడికి కళ్ళూ, వొళ్ళూ తెలిసేది కాదు. ఆడదంటే సీతాలే! దాని నవ్వు, దాని మాట, దాని నడక, అబ్బ ప్రాణాలు తోడేస్తుంది కద... అనుకుంటూ చీరలో సీతాల్ని ఊహించుకుంటూ హుషారుగా ఉతుకుతున్నాడు సాంబడు.

లచ్చి అత్తకోడలంచు పంచ ఉతుకుతోంది. ఆ పంచె కోటేశుది. 'మొగాడంటే కోటేశుగాడే!' అనుకొంది. 'ఎందుకు ఈడూ వున్నాడు మోటు మనిషి! కోటేశు ఎంత నాజూగ్గా వుంటాడు! వారగా ఒక్క చూపు చూస్తే గుండె జల్లుమంటది. మొన్న పండగ రోజు ఈ అత్తాకోడలంచు పంచె కట్టుకుని, తలపాగా చుట్టుకుని బజార్లో ఎల్తావుంటే కార్యవర్ధి రాజులా వుండాడు. అందరి కళ్ళూ ఆడిమీదే..." అనుకుంటూ సంబరంగా ఉతుకుతోంది.

సాంబడికి సీతాలు దొరకలేదు.

లచ్చికి కోటేశు మొగుడవలేదు.

మధ్యాహ్నానికి బట్టలన్నీ ఉతికి, తెచ్చుకున్న అన్నంలోకి పూజారి వీధి నించి కూరలడిగి తెచ్చుకుని మాట్లాడకుండా ఎదురెదురుగా కూర్చుని తిన్నారు లచ్చి, సాంబడు. ఆ పైన బట్టలన్నీ చెట్టుమీద ఆరేశారు. ఒకళ్ళొకపక్క, ఇంకొకళ్ళు ఇంకొక పక్క

## ముత్యాలవాన

పట్టుకుని ఆ బట్టల్ని చెట్టు మీద పరుస్తున్నారే కాని ఇద్దరి మనసులూ ఎక్కడో వున్నాయి. నెమిలి కంఠం చీర ఆరేస్తున్నప్పుడు సాంబడి వొంట్లో నెత్తురు జిల్ మని పొంగింది. అత్తాకోడలంచు పంచె పరిచి ఎగిరిపోకుండా రాళ్ళు పెడ్తుంటే లచ్చికి పొలిండ్లు పొంగాయి.

సాయంకాలానికి ఆరిన బట్టలన్నీ మడతేశారు లచ్చి, సాంబడు. సూర్యుడస్తమించబోతున్న వేళ ఇద్దరూ ఉతికిన బట్టల్లో నచ్చినవి తీసి కట్టుకొన్నారు.

ఆశ్చర్యం!

సీతాలు నెమిలి కంఠం చీరలో లచ్చి అందంగా కనిపించింది సాంబడికి.

కోటేశు అత్తకోడలంచు పంచె కట్టుకున్న సాంబడి వైపు ఆశగా చూసింది లచ్చి.

"మూటెత్తు" అంది లచ్చి.

సాంబడు మూటెత్తి ముందుకొచ్చి లచ్చిని ముద్దు పెట్టుకున్నాడు. లచ్చి తోసెయ్యలేదు. పెదవు లందించి తృప్తిగా నవ్వింది. ◆

### రాయడం

"మీరు ఎప్పుడూ ఏదో ఒకటి రాస్తూనే వుంటారు కదా! మరి ఇప్పుడేం రాస్తున్నారు?" అని ఓ విలేకరి ఒక ప్రముఖ నవలా రచయిత్రిని ప్రశ్నించాడు.

"ఇప్పుడు మాత్రం నోట్సు రాసుకుంటూ వున్నానండీ!" అని నవ్వుతూ చెప్పింది రచయిత్రి.

—నెల్లూరు మనోహరరెడ్డి, (చిల్లకూరు)

### చెవిలో పువ్వులు




### ఇలా

హిందీ నటి జూహీచావ్లా ఓ సారి పోలీస్ స్టేషన్‌లో రిపోర్టిచ్చిందట. "తమ మేడ ఎదురుగా వున్న మేడపై నుంచి ఓ కుర్రాడు అదే పనిగా నన్ను చూస్తున్నాడని."

ఇన్‌స్పెక్టర్ విచారణ కోసం చావ్లా మేడపైకెక్కి "ఇక్కడ నుంచి ఎవరూ కనిపించడం లేదు కదా! మరి ఆ యువకుడు చూసేది మీకెలా తెలుసు" అని ప్రశ్నించాడు.

ఇలా చూడండి కనిపిస్తుంది అంటూ చావ్లా ఓ కుర్చీ పైకెక్కిందట.

—ఎవ్.